సాక్షి
నంద్యాల
శనివారం | 27 | జూలై | 2024



..జాగ్రత్తలతో అభయం

చిరుతల సంచారంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పలు జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారి నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

8లో▸



అమర వీరులకు జోహార్లు

ఎమ్మిగనూరుటౌన్: కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మిగనూరులో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.98
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.695
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,00,871
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,16,026

న్యూస్‌రీల్

బాల్యం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా

బొమ్మలసత్రం: విద్యార్థులు తమ చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుంచే సమాజం పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాలికలపై దాడులు, ర్యాగింగ్ పేరుతో వేధించటం, మాదక ద్రవ్యాల వినియోగం వంటివి చట్ట విరుద్ధమని, వాటికి దూరంగా ఉండేలా వివరించాలన్నారు. ఒక్కసారి నేరప్రవృత్తికి అలవాటు పడితే వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. విద్యార్థులకు ఏదైన సమయంలో పోలీసుల సహాయం అవసరమైతే 100, 112 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.


పార్ట్ టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్ టైం (తాత్కాలిక) టీచర్‌గా విభిన్న స్థాయిల్లో (జేఎల్/పీజీటీ/టీజీటీ) పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ 02 (మ్యాథ్స్ 01, ఫిజిక్స్ 01), పీజీటీ 04 (మ్యాథ్స్ 03, ఇంగ్లిషు 01), టీజీటీ 04 (ఇంగ్లిషు 02, ఫిజికల్ సైన్స్ 02) ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బాలికల పాఠశాలలో స్త్రీలకు, బాలుర పాఠశాలలో పురుషులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీ, బీఎడ్‌లో కనీసం ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత, టెట్‌లో అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఆగస్టు 1వ తేదీన డీసీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు డెమో నిర్వహించబడుతుందన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.196.42 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద ఆగస్టు నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,63,200 పింఛన్లకు రూ.196.42 కోట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 4,69,716 పింఛన్లు ఉండగా... ఆగస్టు నెలకు వచ్చే సరికి 6,916 పింఛన్లపై కోత పడింది. కర్నూలు జిల్లాలో 2,43,337 పింఛన్లకు సంబంధించి రూ.103.54 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,19,863 పింఛన్లకు సంబంధించి రూ.92.88 కోట్ల ప్రకారం ప్రభుత్వం ఈ నెల 31న బ్యాంకులకు విడుదల చేస్తుంది.

మెరుగైన వసతుల కల్పన



డోన్ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

డోన్ రూరల్: డోన్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన స్టేషన్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

నందికొట్కూరు: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, జిల్లా మానిటరింగ్ కమిటీ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. శుక్రవారం పాములపాడు మండల పరిధిలోని మద్దూరు గ్రామ హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువులకు అందించే సేవలను వైద్య సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. కిషోర బాలికలకు రక్తహీనత శాతాన్ని గతంలో చేసిన పరీక్షలతో పోల్చి అవసరమైన వారికి వైద్యం అందించాలని ఆదేశించారు. క్షయ నివారణకు చేపట్టిన బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని చేరకోవాలన్నారు. ఆమె వెంట జిల్లా డేటా మేనేజర్ శివ, సీహెచ్ఓ అన్నమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, సూపర్‌వైజర్ మద్దయ్య, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఖాకీల్లో 'కుల'కలం!

నెలాఖరులోపు డీఎస్పీల బదిలీలు

- ఆ వెంటనే సీఐలకు స్థానచలనం
- సిఫార్సు లేఖల కోసం నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణ
- టీడీపీ 'త్రిసభ్య' కమిటీదే తుది నిర్ణయం
- రెండు సామాజిక వర్గాలకే ప్రాధాన్యత
- ప్రమోషన్ వచ్చినప్పటి నుంచి లూప్‌లైన్‌లోనే పలువురు సీఐలు
- ఈ బదిలీల్లోనైనా న్యాయం కోసం ఎదురుచూపు

సాక్షి ప్రతినిధి కర్నూలు: కొద్దిరోజులుగా రాయలసీమలోని ఏ ఇద్దరు, నలుగురు సీఐలు కలిసినా, ఫోన్‌లు చేసుకున్నా ఇదే చర్చ. 'సీమ జోన్'లో త్వరలో సీఐల బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పుడు సర్కిళ్లలో ఉన్న సీఐలు, ఎస్ఐలు గత ప్రభుత్వంలో డీఓల ద్వారా కొనసాగుతున్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో సీఐలు, ఎస్ఐలు పోస్టింగుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అయితే పోలీసుశాఖ బదిలీల చరిత్రలో ఎప్పుడూ లేని కొత్త పంథా ఇప్పుడు అమలవుతోంది. ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్ అధికారుల చేతుల్లో ప్రభుత్వం నిర్ణయాధికారాన్ని పెట్టినట్లు తెలుస్తోంది. పోస్టింగ్ కోసం ఎమ్మెల్యే లేఖ ఇచ్చినా ఈ పేరును త్రిసభ్య కమిటీ చర్చించి 'గ్రీన్‌సిగ్నల్' ఇస్తేనే డీఓ జాబితాలో పేరు చేరనుంది. లేదంటే మరో పేరును ఇవ్వాలని కమిటీ సూచించనుంది. దీంతో సీఐ, ఎస్ఐలు పోస్టింగ్‌ల కోసం నానా తంటాలు పడుతున్నారు. ఈ త్రిసభ్య కమిటీ రెండు సామాజికవర్గాలకు చెందిన, ఆయా జిల్లాల్లో తమకు నమ్మకమైన సీఐల ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.

ఆగస్టు మొదటి వారంలో బదిలీలు

ఈ నెలాఖరులోపు డీఎస్పీల బదిలీలు ఉన్నాయి. ఇప్పటికే 'త్రిసభ్య కమిటీ' జాబితాను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. చివరగా 'చినబాబు' ఆమోదముద్ర కోసం పంపినట్లు సమాచారం. ఆయన ఓకే అంటే హోంశాఖ జీఓ జారీ చేయనుంది. ఆపై సీఐల బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పటికే సీఐల జాబితా కొలిక్కి వచ్చిందని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే డీఎస్పీల బదిలీల తర్వాతే డీఓ వస్తుందని తెలుస్తోంది. మంత్రులు, ఎస్పీలు, డీఐజీల ఆప్షన్లు కూడా 'త్రిసభ్య కమిటీ' తీసుకుంది. ఈ క్రమంలో అప్రాధాన్యత పోస్టుల్లో(లూప్‌లైన్) కొనసాగుతున్న వారు సర్కిళ్ల కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. ఇదే క్రమంలో లూప్‌లైన్‌లో పని చేయకుండా సర్కిళ్లలో కొనసాగుతున్న వారు ఇప్పుడు తమను లూప్‌లైన్‌లోకి పంపుతారేమోనని జాగ్రత్త పడుతున్నారు. వారికున్న పరిచయాలను ఉపయోగించుకుని సర్కిల్ కోసం ప్రయత్నిస్తున్నారు.

'అన్నా నమస్తే. ఐపీఎస్‌ల పోస్టింగ్‌లు అయిపోయాయి. నెలాఖరుకు డీఎస్పీల బదిలీ జీవో వస్తుందంట. ఆపై ఆగస్టు మొదటి వారంలో మన డీఓలు ఉన్నాయంటనే. ఈ సారైనా మనకు సర్కిల్ ఇస్తారా? లేదంటే లూప్‌లైన్‌లోనే పుణ్యకాలాన్ని పూర్తి చేయాలా? ఎస్ఐ నుంచి సీఐగా ప్రమోషన్ వచ్చినప్పుడు రెండేళ్లు లూప్‌లైన్‌లో చేశాం. కొద్దిరోజులు సర్కిల్ చేసి మళ్లీ లూప్‌లైన్‌లోనే కొనసాగుతున్నాం. ఈ సారైనా సర్కిల్ దొరుకుతుందో, లేదో!

''సార్! పదిరోజుల్లో డీఓలు వేస్తున్నారంట.. ఏంటి పరిస్థితి! సీఐగా ప్రమోషన్ వచ్చినప్పుడు నేను లూప్‌లైన్ చేయలేదు. నేరుగా సర్కిల్ దొరికింది. ఈ డీఓల్లో లూప్‌లైన్‌కి పంపుతారేమోనని టెన్షన్‌గా ఉంది. మా మంత్రిని కలిశా.. నేను చూసుకుంటాలే అన్నారు. నువ్వూ మీ ఎమ్మెల్యేను కలవాల్సింది. లూప్‌లైన్‌లో వస్తే మళ్లీ ఏడాది వరకూ డీఓలు ఉండవంట.''

'ఏం బాసూ! డీఓల టెన్షన్‌తో నిద్రపట్టడం లేదు. రెండు సామాజికవర్గాల వారి పేర్లు ప్రియారిటీగా తీసుకుంటున్నారు. ఆ తర్వాత మిగిలితే మరో సామాజికవర్గాన్ని చూడమన్నారంట. మన సామాజికవర్గాన్ని సర్కిళ్లకు వద్దు అంటున్నారంట. మనతో పాటు మరో సామాజికవర్గానిదీ ఇదే పరిస్థితి. తప్పదనుకుంటే టీడీపీకి లాయల్‌గా ఉన్నారా? లేదా అని చూస్తున్నారంట. ఇంత అధ్వాన్నమైన పరిస్థితి ఎప్పుడూ లేదబ్బా.'



ఓ సామాజికవర్గం వారిని పూర్తిగా పక్కన పెట్టే కుట్ర

'సీమ' రాజకీయాల్లో ఓ సామాజికవర్గం ప్రభావం ఎక్కువ. ఏ పార్టీలోనైనా వీరే క్రియాశీలకంగా ఉంటున్నారు. దీంతో ఎమ్మెల్యేల సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు పోస్టింగ్‌ల కోసం వెళితే 'మన వాళ్లను వద్దంటున్నారబ్బా! నేనైతే గట్టిగా ప్రయత్నిస్తా. ఏం చేద్దాం, ఏందో ఆ కమిటీ ఫైనల్ చేస్తుందంటున్నారు. ఇదేందో కొత్త పద్ధతి. ఇలాగైతే ఈ ప్రభుత్వం సాగినట్టే.' అని మొహాన్నే చెబుతున్నారు. వీరితో పాటు సామాజికవర్గాల్లో 'తక్కువ సంఖ్య'లో ఉన్న మరో వర్గాన్ని కూడా పోస్టింగుల్లో దూరం పెడుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో వారు మనకు అనుకూలంగా పని చేయరనే భావన ప్రభుత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ రెండు వర్గాల సీఐలు తీవ్ర క్షోభ అనుభవిస్తున్నారు.

సమన్యాయం చేయండి 'బాసు'లూ

- ఈ దఫా సీఐల బదిలీల్లో ఓ అంశం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.
- ఏపీపీఎం(ఆంధ్రప్రదేశ్ పోలీస్ మాన్యువల్) నిబంధనల ప్రకారం ఒక ఎస్ఐ తన సర్వీసులో మూడేళ్లు, సీఐ రెండేళ్లు, డీఎస్పీ ఏడాది పాటు లూప్‌లైన్‌లో విధులు నిర్వహించాలి.
- కొందరు ఎస్ఐలు సీఐలుగా పదోన్నతి పొంది రెండేళ్లు లూప్‌లైన్ చేసి ఆపై సర్కిళ్లలో పోస్టింగ్ పొందారు.
- ఇంకొందరు ప్రమోషన్ వచ్చాక లూప్‌లైన్ చేయకుండా నేరుగా సర్కిళ్లలోనే తిరుగుతున్నారు.
- దీంతో ఈ దఫా సీఐల బదిలీల్లో 'లూప్‌లైన్' చేయకుండా సర్కిళ్లలో ఉన్నవారిపై చర్చ నడుస్తోంది.
- వీరితో పాటు ప్రమోషన్ తర్వాత లూప్‌లైన్ చేసి, ఆపై కొంతకాలం సర్కిల్ చేసి తిరిగి లూప్‌లైన్'(ఎస్పీ అటాచ్డ్, పోలీస్‌కంట్రోల్‌రూం, సీసీఎస్, ఐజీ అటాచ్డ్, ఎస్బీ, విజిలెన్స్, ఇంటలిజెన్స్)లో ఉన్నవారు సర్కిళ్ల కోసం ప్రయత్నిస్తున్నారు.
- అయితే వీరికి సర్కిల్‌లలో పోస్టింగ్‌లు రావాలంటే, లూప్‌లైన్లలో పనిచేయకుండా సర్కిళ్లలో కొనసాగుతున్న వారిని లూప్‌లైన్‌కు పంపాలి. లేదంటే ఖాళీలు లేని పరిస్థితి.

గిరాకీ ఉన్న సర్కిల్‌కు భారీ డిమాండ్

లూప్‌లైన్లలో ఉన్నవారు సర్కిల్‌కు, సర్కిళ్లలో ఉన్నవారు తిరిగి సర్కిల్ దక్కించుకునేందుకు సిఫార్సులు మొదలెట్టారు. ప్రజాప్రతినిధులను కలిసి సర్కిల్‌ను బట్టి రూ.15–20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కొందరు సీఐలు డబ్బు లెక్కచేయకుండా పోస్టింగ్ కోసం 'సై' అంటుంటే.. ఇంకొందరు మాత్రం' డబ్బులు ఇవ్వడమూ వద్దూ.. మనం సంపాదించుకోవడమూ వద్దు!' అనే ధోరణిలో ఉన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం, పేకాట జరిగే సర్కిళ్లకే ఎక్కువ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు, భాకరాపేట, చిత్తూరు, అనంతపురం, కర్నూలు పోర్ట్‌టౌన్లు, బద్వేలు, మదనపల్లి, పీలేరుతో పాటు పలు సర్కిళ్లకు భారీ డిమాండ్ ఉంది.

జీలుగ సాగుతో భూమి సారవంతం

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



రైతులతో మాట్లాడుతున్న జేసీ విష్ణు చరణ్

నంద్యాల(అర్బన్): పంటల సాగుకు ముందు జీలుగలు వేయడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే జీలుగలు, పిల్లిపెసర విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నంద్యాల మండలం బిల్లాలపురం గ్రామంలో పచ్చిరొట్ట పైర్లను శుక్రవారం డీఏఓ మురళీకృష్ణ, ఏడీఏ రాజశేఖర్‌లతో కలిసి జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులకు అవసరమైనన్ని జీలుగ విత్తనాలను పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జీలుగా సాగుతో ఎకరా భూమికి రెండు బస్తాల యూరియా అందించినట్లు అవుతుందన్నారు. సీడ్ విలేజ్ వరి విత్తన నర్సరీని పరిశీలించిన అనంతరం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి సబ్సిడీపై విత్తనాలు ఎలా ఇస్తున్నారు, ఒక్కొక్క రైతుకు ఎంతమేర ఇస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో జీతం వెతలు

- జూలై ముగుస్తున్నా అందని జూన్ వేతనం



కోడుమూరు మండలం గోరంట్ల మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్స్ సిబ్బందికి జూన్ నెల జీతం ఇప్పటికీ అందని పరిస్థితి. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి, గోరంట్ల, ఆరెకల్, నంద్యాల జిల్లాలో డోన్, నెరవాడ, బేతంచెర్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, సున్నిపెంట ప్రాంతాల్లో బాల బాలికలకు ఈ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డోన్, బేతంచెర్ల, నెరవాడ స్కూల్స్ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, గెస్ట్ ఫ్యాకల్టీ, సీఆర్‌టీలు (మూడు విభాగాలుగా) విద్యా బోధన చేస్తున్నారు. అలాగే ఈ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాల్గవ తరగతి సిబ్బందిని నియమించారు. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న వారిలో 010 పద్దు కింద ఉన్న 10 శాతం మంది ఉద్యోగులకు మాత్రమే జీతాలు అందాయని, మిగిలిన 90 శాతం మంది ఉద్యోగులకు నేటికీ జీతాలు అందని పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలోని సున్నిపెంటలో 70, నెరవాడలో 59 మందితో పాటు మిగిలిన అన్ని పాఠశాలలో 20 నుంచి 40 మంది దాకా ఉపాధ్యాయులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని పాఠశాలల్లో దాదాపు 350 మందికి పైగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. జూలై నెల గడిచిపోతున్నా, జూన్ నెల జీతాలు విడుదల కాకపోవడం పట్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తమవుతోంది.

సంగమేశ్వరాలయ శిఖర భాగానికి చేరిన కృష్ణాజలాలు



కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయం జలాధివాసానికి కేవలం నాలుగు అడుగుల దూరంలో ఉంది. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సంగమేశ్వరం వద్ద ఆలయం పైభాగాన శిఖర భాగానికి చేరాయి. శుక్రవారం రాత్రికి పూర్తిగా సంగమేశ్వరాలయం జలాధివాసంలోకి వెళ్లనుంది. దీంతో చివరిసారిగా ఆలయ పురోహితులు పుట్టిలో వెళ్లి శిఖరభాగానికి విశేషపూజ కార్యక్రమాలు చేపట్టారు.

మాన్యం భూమిని స్వాధీనం చేయండి

- ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఆదేశం

మహానంది: ఆక్రమణకు గురైన మహానంది దేవస్థానానికి చెందిన కోట్లాది రూపాయల విలువైన మాన్యం భూమి మళ్లీ దేవస్థానం పర్వమైంది. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో ఉన్న 3.78 ఎకరాల భూమిలో కొంత భాగాన్ని కొందరు ఆక్రమించి క్రయ, విక్రయాలు చేశారు. ఈ మేరకు మహానందీశ్వరస్వామి దేవస్థానం తరపున భూమిని స్వాధీనం చేసుకునేందుకు 2021లో ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ దేవస్థానానికి చెందిన భూములను ఆక్రమించుకున్న వారు నెలరోజుల్లోగా స్వాధీనం చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను నంద్యాల డిస్ట్రిక్ట్ ఎండోమెంట్ ఆఫీసర్ గురువారం మహానంది దేవస్థానం అధికారులకు పంపించారు. ఇదిలా ఉండగా అప్పటి ఈఓలు శంకర వరప్రసాద్, మల్లికార్జునప్రసాద్‌లతో పాటు తాజాగా బదిలీ అయిన కాపు చంద్రశేఖర్‌రెడ్డి దేవస్థానం భూమిని ఆలయానికి చెందేందుకు ఎంతో కృషి చేశారు. పలుమార్లు ఉన్నతాధికారులతో చర్చించి ఏపీ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌కు అన్ని ఆధారాలు సమర్పించడంతో మాన్యం భూమి దేవస్థానానికి తిరిగి చేరింది. విలువైన దేవస్థానం భూమిని కాపాడటంతో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు హర్షం వ్యక్తం చేశారు.

బిల్వసర్గం గుహల అభివృద్ధికి కృషి

- కలెక్టర్ రాజకుమారి



బిల్వ సర్గం గుహలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల: సహజ సిద్ధంగా ఏర్పడిన బిల్వ సర్గం గుహల అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కనుమకింది కొట్టాల గ్రామ సమీపంలోని బిల్వ సర్గం గుహలను ఆమె సందర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి గుహల సందర్శనకు వచ్చే పర్యాటకులకు అందుబాటులో ఉన్న వసతులు, తదితర అంశాలపై జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాకు వచ్చే వీఐపీలను ఇక్కడికి ఆహ్వానించి గుహల ప్రాధాన్యతను వివరించాలన్నారు. గుహల ప్రాశస్త్యం గురించి అందరికి తెలిసేలా, పర్యాటకుల తాకిడి పెరిగేలా వీడియో తయారు చేసి ప్రచారం చేయాలన్నారు. గుహలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గుహల సమీపంలోని రెస్టారెంట్‌ను వినియోగంలోకి తెచ్చి పర్యాటకులకు ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మండలంలోని గోరుమానుకొండ సమీపంలోని బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూలు, కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, వసతులు, ఉపాధ్యాయుల గురించి తెలుసుకున్నారు. బీసీ రెసిడెన్షియల్ భవన నిర్మాణాలు బాగున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. 680 మంది విద్యార్థులు, 21 మంది ఉపాధ్యాయులు, 8 మంది జూనియర్ లెక్చరర్లు ఉన్నారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గౌడ్ కలెక్టర్‌కు వివరించారు. భవన నిర్మాణాల పురోగతిపై ఏఈ మునిస్వామిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఆర్వో ప్లాంట్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని, అడవి ప్రాంతంలో పాఠశాల ఉన్నందున్న స్టాఫ్, వార్డెన్, ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆయకట్టుకు హామీ దక్కేనా?

- నేడు తెరుచుకోనున్న పోతిరెడ్డిపాడు గేట్లు
- హంద్రీ–నీవాకు నీటి విడుదలపై స్పష్టత కరువు
- గోరుకల్లు మరమ్మతులతో ఎస్ఆర్‌బీసీ కింద సాగు ప్రశ్నార్థకం
- ఈ నెల 29న నంద్యాల జిల్లా ఐఏబీ సమావేశం



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్

కర్నూలు సిటీ/జూపాడుబంగ్లా: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణ, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. వరద నీటి చేరికతో శ్రీశైలం రిజర్వాయర్ జలకళను సంతరించుకుంటోంది. ఈ నేపథ్యంలో పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ గేట్లు నేడు(శనివారం) తెరవనున్నారు. అయితే హంద్రీ–నీవా కాలువకు నీటి విడుదలపై ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. అలాగే గోరుకల్లు జలాశయం మరమ్మతుల నేపథ్యంలో ఎస్ఆర్‌బీసీ కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. నంద్యాల జిల్లా ఐఏబీ సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్న నేపథ్యంలో ఆయకట్టుకు హామీ దక్కేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కృష్ణ, తుంగభద్ర జలాలపై ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. తెలుగుగంగ కింద నంద్యాల జిల్లాలో 1.14 లక్షల ఎకరాలు, ఎస్ఆర్‌బీసీ కింద 1.53 లక్షల ఎకరాలు, కేసీ ఎస్కేపు చానల్ ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో హంద్రీ–నీవా కాలువ కింద 80 వేల ఎకరాలు, కేసీ కాలువ కింద 3,340 ఎకరాలు సాగవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 2.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. తుంగభద్ర జలశయంలోకి వరద నీరు భారీగా వస్తుండటంతో 33 గేట్లు పైకెత్తి లక్ష క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు కోట్ల విజయభాస్కర్ రెడ్డి బ్యారేజీ(సుంకేసుల బ్యారేజీ)కి చేరుకునే అవకాశం ఉండడంతో ముందస్తుగా రెండు గేట్లుపైకెత్తి 7,286 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 861 అడుగుల నీటిమట్టం నమోదైంది. టీబీ డ్యాం నుంచి విడుదల చేసిన నీరు చేరితే నీటి మట్టం వేగంగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పోతిరెడ్డి పాడు ద్వారా 12 టీఎంసీల నీటిని తీసుకునేందుకు జలవనరుల శాఖ ఇంజినీర్లు ఇండెంట్ పెట్టారు. తెలుగుగంగ కెనాల్‌కు 3 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీ కాల్వకు 3 టీఎంసీలు, గాలేరు–నగరికి 4 టీఎంసీలు, కేసీ ఎస్కేపు చానల్‌కు 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నేడు(శనివారం) 12 వేల క్యూసెక్కుల నుంచి 15 వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేయనున్నారు. ఇదిలా ఉండగా హంద్రీ– నీవా కాలువకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా (శ్రీశైలంలో 810 అడుగులకు చేరితే), మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా (834 అడుగులకు చేరితే) నీరు ఇచ్చే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం ఇంకా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లాలో సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులకు, కుంటలకు నీరు చేరలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు.



సంతకం చేసేవారేరీ?

- కౌన్సెలింగ్ వేళ పెండింగ్‌లో ధ్రువీకరణ పత్రాలు
- ఇన్‌చార్జ్ తహసీల్దార్ లేక సమస్య



టేబుళ్లపై దరఖాస్తులు

నంద్యాల(అర్బన్): కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, మరణ ధ్రువీకరణ తదితర పత్రాలకు తహసీల్దార్ సంతకం కోసం దరఖాస్తు దారులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల విధుల్లో వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర్ ఐదు రోజుక్రితం బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. తహసీల్దార్ స్థానంలో ఎవరికీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వకపోవడం, డిజిటల్ కీ లేకపోవడంతో దరఖాస్తు దారులు సంతకాల కోసం ఎదురు చూస్తున్నారు. సచివాలయ అధికారులు, వీఆర్‌ఓ, ఆర్‌ఐ సంతకాలతో కూడిన దరఖాస్తులు కార్యాలయంలో కుప్పలు తెప్పలుగా పేరుకొని పోతున్నాయి. ముఖ్యంగా ఎంసెట్, ట్రిపుల్‌ఐటీల్లో కౌన్సెలింగ్‌కు వెళ్లే విద్యార్థులు సంతకాల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. కౌన్సెలింగ్ సమయం పూర్తయితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. సంతకాలు ఎప్పుడు చేస్తారో... సర్టిఫికెట్ ఎప్పుడు చేతికొస్తుందో తెలియక దరఖాస్తు దారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్ వచ్చే వరకు మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.


చిరుత భయం.. జాగ్రత్తలతో అభయం

- వాటికవే దాడి చేయవు
- ముప్పందని భావిస్తేనే మనుషులపైకి
- అటవీ సమీప ప్రాంతాల్లో చిరుతల సంచారం సహజం
- కుక్కల కోసమే జనావాసాల్లోకి రాక
- అటవీ అధికారులకు సమాచారం ఇస్తే సురక్షితం

ఆత్మకూరురూరల్: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల సమీపంలో చిరుతల సంచారం పెరుగుతోంది. మహానంది, శ్రీశైలం లాంటి పుణ్యక్షేత్రాల్లో కూడా చిరుతల సంచారంపై ఎక్కువ కావడంతో అటు భక్తులు, ఇటు స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. శిరువెళ్ల మండలం పచ్చర్ల వద్ద ఒక కూలిపై చిరుత దాడి చేసి గాయ పరచడం, మరో మహిళను చంపడం వంటి ఘటనలతో పరిస్థితి తీవ్రంగా మారింది. వాటిని బంధించి తరలించాలనే ప్రజల ఒత్తిడి అటవీ అధికారులపై అంతకంతకూ పెరుగుతోంది.

కుక్కల కోసమే..

సాధారణంగా చిరుతలు ఎక్కడైనా మనుగడ సాగించగల పిల్లి జాతి జంతువులు. వీటికి దట్టమైన అడవులే అవసరం లేదు. అటవీ ప్రాంతాల్లో మేత కోసం గొర్రెల మందలను తీసుకెళ్లే సమయంలో వాటి వెంట నడిచే కుక్కల సవ్వడి చిరుతను ఆకర్షిస్తుంది. దీంతో మందలను చిరుతలను అనుసరిస్తూ గ్రామాల్లోకి గాని, గొర్రెల మందలు నిలిపే పెంటల వద్దకు గానీ చిరుతలు చేరుకుంటాయి. అదును చూసి అక్కడ ఉండే కుక్కలను ఎత్తుకు పోతుంటాయి. అప్పుడప్పుడూ గొర్రెలపై కూడా దాడులు చేస్తుంటాయి. అలాగే మహానంది, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలు కీలకమైన నాగార్జున సాగర్–శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో ఉండడంతో సహజంగా చిరుతలు జనావాసాల సమీపంలో తిరుగాడడం సహజమైన అంశమే. అన్నదాన సత్రాలు, హాస్టళ్ల వంటి చోట మిగిలిపోయే ఆహార వ్యర్థాలను బయట పారేస్తూ ఉంటారు. అక్కడకు కుక్కలు గుంపులుగా చేరుతుంటాయి. అవి చిరుతలకు అందుబాటులో ఉన్న ఆహారంగా మారతాయి. చిరుతలు అత్యంత సహజంగా కుక్కలను ఎత్తుకు పోయి ఆహారంగా తీసుకుంటుంటాయి. చిరుతలు, అడవి పందులను తరుముతూ కూడా శ్రీశైలం క్షేత్రంలో ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఎవరో ఒకరు చిరుతలను చూడటం భయభ్రాంతులకు గురై గగ్గోలు పెడుతుంటారు. ఇవి మరుసటి రోజు వార్తాంశంగా మారి మొత్తం రాష్ట్రంలోని ఓ రకమైన చిరుత ఫోబియాను విస్తరిస్తుంటుంది.



ప్రత్యేక పరిస్థితుల్లోనే మనుషులపై దాడి

సాధారణంగా చిరుతలు ఆహారం కోసం మనుషులపై దాడులు చేయవు. రెండు కాళ్లపై సంచరించే ఏ జంతువు (మనిషి) చిరుతలకు ఆహారం కాదు. చిరుతలు మనుషులకు కనిపించకుండానే సంచరించేందుకు ప్రయత్నిస్తుంటాయి. అటవీ ప్రాంతాల్లో పిల్లలతో సంచరించేటప్పుడు పెద్దవారు తగు జాగ్రత్తలతో ఉండాలి. అటవీ ప్రాంతాల్లో ఒంగి పని చేయడమో, ఆహారం తినేందుకు కింద కూర్చోవడమో చేయడం ద్వారా చిరుతలకు మనుషులు ఆహార జంతువులుగా అనిపిస్తారు. ఈ సమయంలోనే ఎక్కువ దాడులు జరుగుతుంటాయి. రైల్వే పనులకు వచ్చిన ఒక మహిళ కూర్చొని భోజనం చేస్తుండగానే చిరుత దాడికి గురైంది. మరో మహిళ అడవిలో వంట చెరుకు కోసం వంగి పని చేస్తుండగానే చిరుత దాడి చేసింది.

చిరుతల నుంచి ఎలా రక్షించుకోవాలంటే..

- అటవీ ప్రాంతాల్లో సంచరించే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ కింద కూర్చోవడం కాని, ఒంగి నడవడం కానీ చేయరాదు.
- శ్రీశైలం ఘాట్ రోడ్డులో వెళ్లే ప్రయాణికులు అత్యవసర పరిస్థితుల్లో తప్ప వాహనాలను అడవిలో నిలపరాదు. అలాగే చిరుతిళ్లు, అల్పాహారం తినడానికి అడవిలో వాహనాలు నిలుపరాదు.
- అడవుల్లో సంచరించే వారు చేతిలో ఒక పట్టుడు కర్రలాంటిది చేతిలో ఉంచుకోవాలి. ఆ కర్ర మ నిషి ఆకారాన్ని పెద్దదిగా చేసి చూపడం వల్ల చిరుతల్లాంటి వన్యప్రాణులు భయపడి దగ్గరకు రావు.
- శ్రీశైలం, మహానంది లాంటి పుణ్యక్షేత్రాల్లో ఆహార వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా శ్రద్ధ వహించాలి.
- రాత్రిళ్లు బయట తిరగకుండా ఉండడం మంచిది.

బంధించడం పరిష్కారం కాదు

చిరుత దాడులు, సంచారం ఎక్కువైనప్పుడు ప్రజల నుంచి వాటిని బోనులో బంధించి మరో చోటుకు తరలించాలన్న డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. అధికారులు కూడా ఈ ఒత్తిడితో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు పెట్టి వాటి ఉనికి కనిపెట్టి ఆ ప్రాంతంలో బోను పెట్టి బంధిస్తుంటారు. అయితే చిరుతలు కూడా పెద్ద పులిలాగే జీవన శైలిలో నిర్దేశిత(టెరిటరీ)ప్రాంతంలోనే తిరుగుతుంది. ఆ ప్రాంతానికి మరో చిరుతను రానివ్వవు. ప్రజల డిమాండ్ మేరకు ఒక చిరుతను బంధించి వేరే ప్రాంతంలో వదిలి వేస్తే ఖాళీ అయిన టెరిటరీలోకి మరో చిరుత వచ్చి చేరుతుంది. ఎన్ని చిరుతలను బంధించినా సరే మరో చిరుత రావడం ఖాయం. తిరుమలలో మనకు ఈ విషయం స్పష్టమైంది. కాబట్టి అటవీ సమీప జనావాసాల్లో జీవించే వారు వన్యప్రాణులతో సంఘర్షణ పడుతూ సహజీవనం చేయాల్సిందే. కాకపోతే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చు.

చిరుత మనుషులపై దాడి చేయదు



ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప చిరుత సాధారణంగా మనుషులపై దాడికి పూనుకోదు. చిరుత అడవుల్లోనే కాక, మైదాన ప్రాంతాలు, పట్టణ శివార్లలోనూ మనగలిగే వన్యప్రాణి. చిరుతకు కుక్కలపై మక్కువ ఎక్కువ. అందుకే వాటిని అనుసరిస్తూ గ్రామాల్లోకి, అటవీ సమీప జనావాసాల్లోకి వస్తుంటాయి. జనావాసాల్లో చిరుత కనిపిస్తే దాడి చేయొద్దు. వెంటనే సమీపంలోని అటవీ అధికారులకు సమాచారమివ్వాలి. చిరుత లాంటి వన్యప్రాణులకు హాని కలిగిస్తే శిక్షార్హులవుతారు.

– సాయిబాబా, డీడీ పీటీ, ఆత్మకూరు

నేడు రెండో విడత కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి, శిక్షణా శాఖ ఆదేశాల మేరకు డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాల కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల జిల్లా కన్వీనర్ ప్రసాదరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డోన్ ఐటీఐలో జరిగే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి సెల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని ఇచ్చామన్నారు.

ఎన్ఎల్ఎం నిధులతో గొర్రెల యూనిట్లు

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) నిధులు మంజూరు చేసింది. గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎల్ఎం శ్రీకారం చుట్టింది. 100 నుంచి 500 గొర్రెలు, మేకల వరకు సబ్సిడీపై యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. 500 గొర్రెలతో షెడ్ ఏర్పాటు చేసుకుంటే యూనిట్ కాస్ట్ రూ.కోటి ఉంటుంది. ఇందులో షెడ్ కాస్ట్, గొర్రెల విలువ ఉంటాయి. 50 శాతం ఎన్ఎల్ఎం సబ్సిడీ ఇస్తుంది. ఇప్పటి వరకు 32 మంది నేరుగా ఎన్ఎల్ఎంకు దరఖాస్తు చేసుకోగా జిల్లాకు పరిశీలనకు వచ్చాయి. అన్నింటిపై సమగ్రంగా పరిశీలించిన తర్వాత అంగీకారం తెలుపుతూ జిల్లా అధికారులు తిరిగి పంపారు. ఇందులో మొదట రూ.కోటి విలువ యూనిట్లు రెండు మంజూరు చేస్తూ ఎన్ఎల్ఎం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక యూనిట్ వెల్దుర్తి మండలం మల్లెపల్లి, మరొక యూనిట్ కౌతాళం మండలం అర్దగేరి గ్రామానికి మంజూరైంది. సబ్సిడీ మొత్తం బ్యాంకు ఖాతాకు విడుదలవుతుంది. బ్యాంకు ద్వారా యూనిట్ గ్రౌండింగ్ అవుతుంది. ఆగస్టు నెల రెండో వారంలో యూనిట్లు గ్రౌండింగ్ కానున్నాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాల సంఖ్య పెంచాలి



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డాక్టర్ కాంతారావు నాయక్

కొత్తపల్లి: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాప్ డయేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పెద్ద గుమ్మడాపురం, శివపురం చెంచుగూడెం, గువ్వలకుంట్ల గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు ఉన్నాయని ప్రజలందరూ ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్య సేవలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లోని గర్భిణుల ప్రసవాల తేదీలను వైద్యశాలల్లో పొందుపరచడంతోపాటు హైరిస్క్ మహిళల ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ప్రతి గురువారం పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన అనంతరం పింకు, బ్లూ ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా సిబ్బంది ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గిరిజన గూడెంలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య సేవలు అందించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు జబీర్, హకీమ్ రషీద్, విజయేంద్ర వైద్య సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

కర్నూలు (అగ్రికల్చర్): కల్లూరు మండలం దూపాడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన యువకుడి వయస్సు 25 సంవత్సరాలు ఉంటుంది. విషయం తెలిసిన వెంటనే కర్నూలు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చీర సారె సమర్పణ



ఊరేగింపుగా వస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా భక్తులు చీర సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు అక్కడి నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో చౌడేశ్వరిదేవి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో భక్తుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో చీర సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి చీర సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పీవీ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



మృతి చెందిన బ్రహ్మయ్య ఆచారి

ఉయ్యాలవాడ: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఉయ్యాలవాడ మండలం సర్వాయిపల్లె – ఎస్.లింగందిన్నె రహదారిలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్య ఆచారి (70) విశ్రాంత ఆర్‌టీసీ డ్రైవర్. స్వగ్రామం నుంచి నంద్యాల పట్టణంలోని బంధువైన మామను చూసేందుకు శుక్రవారం బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో సర్వాయిపల్లె గ్రామ సమీపంలో ఆళ్లగడ్డ నుంచి ఎదురుగా వేగంగా వస్తున్న కారు ప్రమాదవశాత్తూ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య లీలావతమ్మ, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు దొర్నిపాడు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోస్పాడు: మండల కేంద్రమైన గోనెగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గంజిహళ్లి గ్రామానికి చెందిన ఉప్పర మధుసూదన్(43) అనే వ్యక్తి మృతి చెందాడు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. స్వగ్రామమైన గంజిహళ్లి నుంచి గురువారం సాయంత్రం ఎమ్మిగనూరుకు వెళ్లిన మధుసూదన్ పని ముగించుకొని రాత్రి తిరిగి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గోనెగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి గంజిహళ్లి గ్రామానికి చెందిన ఉప్పర మధుసూదన్‌గా గుర్తించారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం



మృతి చెందిన నాగేంద్ర

శిరివెళ్ల: నంద్యాల–ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్లకు చెందిన వాల్మీకి నాగేంద్ర (32), అతని స్నేహితుడు రాము కూల్‌డ్రింక్, వాటర్ బాటిల్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు కలసి వ్యాపారం నిమిత్తం ఆటోలో కూల్‌డ్రింక్, వాటర్ బాటిళ్లతో నంద్యాల వైపు బయలుదేరారు. మార్గమధ్యలో ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఆటోను అధిగమించబోయి ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. రాము స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతునికి ఇరువురు కుమారులున్నారు. ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆటలకు దూరమై.. 'సెల్'లో బందీలై!

ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన బాల్యం వారిది. తరగతి గదుల్లో జ్ఞానాన్ని పొందాల్సిన వారు 'సెల్'లో బందీగా మారుతున్నారు. తీరిక సమయాల్లో పాఠ్యాంశాలు నేర్చుకోవాల్సింది పోయి స్మార్ట్ ఫోన్ తెరకు అతుక్కు పోతున్నారు. దేవనకొండలో శుక్రవారం బాలురు సెల్‌ఫోన్లు చూస్తూ ఇలా కనిపించారు. ఏది చెడో, ఏది మంచో తెలుసుకోలేని వయస్సులో వీరు తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది.

– దేవనకొండ

క్లుప్తంగా

మళ్లీ ఈశ్వర్ నగర్‌లో చిరుత సంచారం

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతో పాటు ఈశ్వర్‌నగర్ కాలనీని చిరుత వదిలివెళ్లడం లేదు. తాజాగా శుక్రవారం రాత్రి మరోసారి ఆ కాలనీ శివారులోకి చిరుత వచ్చినట్లు కాలనీ వాసులు అరవింద్, బాబు తెలిపారు. కాలనీ శివారులో కనిపించగా కేకలు వేయడంతో అడవి వైపు వెళ్లినట్లు చెప్పారు. అటవీశాఖ, దేవదాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సహకరించి చిరుత బంధించి సుదూర ప్రాంతాలకు తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రసవానికి వచ్చి ప్రాణం విడిచి!

- ఆసుపత్రిలో గర్భిణి మృతి



మృతి చెందిన గర్భిణి గౌసియా

ఆళ్లగడ్డ: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణి మృతి చెందింది. పట్టణంలోని కుబ్బా వీధికి చెందిన గర్భిణి గౌసియా (36)కు శుక్రవారం తెల్లవారుజామున ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబీకులు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మొదటి రెండు కాన్పులు సాధారణం కావడంతో మూడో కాన్పు కూడా సాధారణంగా అవుతుందని కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది భావించారు. ఆసుపత్రికి వచ్చిన కొంత సమయానికే ఉమ్మనీరు ఎక్కువగా పోవడంతో నీరసంగా ఉందని తెలుసుకున్న నర్సులు వైద్యం అందిస్తుండగా ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురైంది. ఈ విషయం వైద్యాధికారిణి డాక్టర్ సుజాతకు తెలపడంతో ఆమె ఆసుపత్రికి వచ్చి పరిశీలించగా అప్పటికే గౌసియా మృతి చెందింది. గర్భిణీతో పాటు కడుపులో ఉన్న శిశువు కూడా మృతి చెందింది. గౌసియాకు మొదటి నుంచి రక్తం చాలా తక్కువగా ఉందని, కాన్పు నొప్పుల్లో ఉమ్మనీరు ఎక్కువగా పోవడంతో డీ హైడ్రేషన్‌కు గురై ఫిట్స్‌తో పాటు హార్ట్ స్ట్రోక్ వచ్చి మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతి చెందిన యశ్వంత్

వెలుగోడు: మండలంలోని రేగడగూడురు గ్రామంలో శుక్రవారం ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన స్వాములుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు యశ్వంత్ (19) ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పొలం పని కోసం వెళ్లి విద్యుత్ మోటర్ ఆన్ చేస్తుండగా అప్పటికే ప్రమాదవశాత్తూ స్టార్టర్‌కు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. చేతికందిన కుమారుడు అకాల మరణంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

బాలుడికి అరుదైన శస్త్రచికిత్స



బాలుడితో డాక్టర్లు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరామ్ ఆసుపత్రిలో బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఊపిరితిత్తుల్లో గడ్డ ఉండటంతో తొలగించారు. శుక్రవారం వైద్యులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన శ్రావణి, హుసేన్‌ల కుమారుడు లలిత్‌కుమార్(16నెలలు)కు ఆయాసం ఎక్కువ కావడంతో ఆసుపత్రికి వచ్చారు. ఎక్స్‌రే, సీటీ స్కాన్ తీయగా ఊపిరితిత్తుల్లో గడ్డ కనిపించింది. పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ రవిందర్, సీటీవీఎస్ (కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్) సర్జన్ మురళీహరీష్, కార్డియాక్ అనస్తియాసిస్ట్ చెన్న కేశవ.. సుమారు మూడు గటంల పాటు ఆపరేషన్ చేసి ఊపిరితిత్తులో ఉన్న గడ్డను బయటకు తీశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఆపరేషన్‌ను ఉచితంగా చేసినట్లు డాక్టర్లు చెప్పారు.

రాష్ట్ర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి అవార్డులకు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డిప్యూటీ డీఈఓ, ఎంఈఓల ద్వారా నిర్ణీత గడువులోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఒరిజినల్‌తో పాటు డీఈఓ, డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.